# అనాథ

...తప్పు, నిప్పు సమానమంటారు. చూసి తాకినా, చూడక తాకినా, నిప్పు కాల్చుతుంది. అలాగే తెలిసి చేసినా, తెలియక చేసినా, తప్పు తప్పే దానికి మనమేర్పరుచుకొన్న "శిక్షాస్మృతి"లో అతి ప్రాధాన్యం. ప్రతిజీవికి నేరం చేయకూడదనే భావం ఒకటియుంటే.. కాని అదిచేయడానికి హేతువైన పరిస్థితుల ప్రభావాలు, వాని ప్రాబల్యం లోకదృష్టికి అనవసరం. మనిషిలోని మంచితనం తరిగిపోవడానికి కారణం ఎదుటివారి అసహనమే ఈ కారణ ఘాతాలు, ఎంతటి చేయరాని కార్యమైనా చేయిస్తుంది......

శారదా అక్క అనుబులోకి వచ్చిం తర్వాతే సుధారాణి పెళ్ళి జరిగిపోయింది. అయినా దైవం ప్రతికూలించింది. సుధారాణి, బాలవితంతువు. ఆమెకు భర్త రూపం కలా మాత్రంగానైనా తెలీదు. పరికిణీలలో ఉన్న సుధమనస్సు నొవ్వ కూడదని సుమంగళి చిహ్నాలు ధరించినా, యింట్లో ఎవరూ ఏమి పట్టించుకోలేదు. కానీ, యిప్పటి పరిస్థితి వేరు. తల్లి మరణించడంతో, పిన్ని యింట్లో కాలు పెట్టింది. తన ఎత్తుబిడ్డను చూస్తూనే పిన్ని సాధించడం మొదలెట్టింది. అయినా, సుధ సహనం కోల్పోలేదు.

ఒకనాడు సుధ, మొహం కడుక్కుని బొట్టు తిలకాన్ని ధరించి, తనకిష్టమైన మల్లెపూల దండను జడలో పెట్టుకుంటోంది. అటుగా వచ్చిన పిన్ని వింతగా తన్ను చూస్తూ "అదేమిటే! బొత్తిగా చెడిపోతున్నావ్. ఆ పూలు, బొట్టు పెట్టుకోమని ఎవరు చెప్పారు నీకు? తీసి అవతలపారేయ్. మొగుడు పోయిందానికి ఈసొగసేమిటి?" అంటూ ఆదరాబాదరాగా పిన్నే బొట్టుచెరిపి పూలు తీసిపారేసింది. ఈ సంఘటన సుధారాణి హృదయంలో కెలికింది. నోటమ్మట మాటరాక అలానే నుంచుండిపోయింది. కట్టలు తెంచుకుని కన్నీరు ప్రవహిస్తూంటే చరచరా గదిలోకి వెళ్ళి దిండులో తలదూర్చి పడింది.

సుధారాణి స్కూలుకు వెళ్ళడం మానుకుంది. గడప దాటకూడదని పిన్నిశాసనం. ఇంట్లోనే తులసిచెట్టు దగ్గర కూర్చొని పూజలు చేయాలి. ఏ రామాయణమో? భాగవతమో?

గొల్లపల్లి పట్టాభిరామశర్మ



నిత్యం పారాయణ చేయాలి. ఇంట్లోని నవలలను పొయ్యిరాజెయ్యడానికి ఉపయోగించుకుంది పిన్ని. భగవంతుడిచ్చిన కవితాకళను ఉపసంహరించుకొని, కలాన్ని గూటిలో పెట్టడం సుధారాణికి విసుగుజనించింది. కూతురి అవస్థను చూడలేక ఇంట్లోనే చదువు చెప్పడానికి మేష్టారును కుదిర్చాడు తండ్రి. ఈ అవకాశాన్ని పిన్ని జారవిడుచుకోలేదు. పొద్దస్తమాను తమనే చెక్ జేయడం, మధ్య మధ్య సాధించడం పరిపాటయింది.

ఒకనాడు సుధారాణి వంటింట్లో అన్నీ సర్ది పెట్టి, తన గదిలోకి వెళ్తుంటే వెన్నెల గదిలోంచి గుసగుసలు విన్పించినయి. సుధ తెలుసుకుందామనుకొని కుతూహలంతో వింటోంది

"ఏమండీ! ....మిమ్మల్నే!... అలా చూస్తారేం? దిష్టిబొమ్మలా!". ఇది విన్నారా! మీ సుధారాణిగారు ఏం చేస్తున్నారో? చదువు చెప్పడానికి వచ్చే ఆ పోకిల్లాగాడితో సినిమాకి వెళ్ళిందిట. బాల్కనీలోంచి దిగుతూంటే సుందరమ్మత్త చూసిందట. పేరంటానికి వెళ్ళవచ్చిలోగా ఇంత చేసింది. లేకుంటేనా!" పళ్ళుకొరికింది కసిగా. "నీకెంత కోపం దేనికి దానిమీద. మురళి వెళ్తే, వెళ్ళింది." అన్నాడు నాన్న. "ఏమో! బాబూ అది ఏ వాగులో పోతే నాకేం? ఇంటికి వచ్చే అప్రతిష్ట ఎలాగూ వస్తుంది" ఇక వినలేకపోయింది సుధారాణి.

......నా జీవితమే నాకు భారమనిపిస్తోంది. ఈ బరువు బాధ్యతను నెత్తిన పెట్టుకొని ఎంతదూరం వెళ్ళగలను. ఆ దూరము ఎక్కడికి అంతమౌతుంది. అంతవరకూ నేను సహనంతో ఉండగలనా? కర్తవ్యం మృగ్యమైంది. శూన్యదృష్టులతో ఎలా ఇంకెంతసేపు గడిపానో?........."సుధా" అన్నయ్య పిలుపుతో ఉలికిపడి చూసింది. "ఏమిటే ఆ వెర్రిచూపు క్రింద కూర్చున్నావు? ... ఏడుస్తున్నావా పిచ్చిపిల్ల. ఎందుకా ఏడుపు?" తడిసిన చెక్కిళ్ళను అరచేత్తో తుడుస్తూ అన్నాడు మురళి ఇక ఆపుకోలేకపోయింది "అన్నయ్యా!" అని గుండెల్లో వాలిపోయింది.........

"ఈ స్వార్థ ప్రపంచంలో ఈ నిరర్థక జీవితాన్ని లాగలేనన్నయ్యా! శ్రమించాను. నాకు విశ్రాంతి అవసరము శాశ్వతంగా విశ్రమించదలచుకొన్నాను" "సుధా!... ఏమిటా మాటలు" గద్దింపుగా అన్నాడు. కానీ, మురళి గొంతు బొంగురుపోయింది. "సుధా!' రచనలవల్ల ఒకరికి బుద్ధిచెప్పిన నీవేనా జీవిత భారాన్ని మోయలేనంటున్నది? ఇదిగో చూడు! నీవు రాసిన కథకు ... సోదర పాఠకుని లేఖ 'నిజానికి జీవితంలో పోగొట్టుకునేది ఏమీ ఉండదు ఏదో పోగొట్టుకున్నామనే భావనతో జీవితాంతం కృంగి కృశించి నశించడం బుద్ధితెలివితక్కువ. మనిషి విలువలు బట్టి, మంచితనం బట్టి రాణిస్తాడు మనిషి మనిషిగా బ్రతకడం నేర్చుకో జీవితం నిండుగా చేసుకో? తను అనుభవించే బాధలన్నీ తనకొరకే సృష్టించి పెట్టుకోవద్దు. ఆ బాధలను మరొక అనుభూతిగా అనుభవిస్తే జీవితం తేలిక అవుతుంది — మీరు వ్రాసిన ఈ వాక్యాలు నా జీర్ణ జీవితాన్ని అంతమొందించి రమ్య

జీవితాన్నే ప్రసాదించాయి. మీకు నా ధన్యవాదములు' ఆ ఉత్తరాన్ని చదివిన సుధారాణికి ఏదో మార్పు కన్పించింది. "అన్నయ్యా! నిజంగా నాకీ ఉత్తరం కనువిప్పింది ప్రతిజీవికి తన ప్రాణాల మీద తీపి ఉంటుంది. నేనెలాంటి



అఘాయిత్యాన్ని తలపెట్టను అది నాలోని బలహీనత, అంత ధైర్యం నాలో లేదుకూడా.

*  *  *

మురళి కనులు అశ్రువులతో ఆర్ద్రమయాయి. చెల్లాయి ఫోటోనుతదేకంగా చూస్తూ శాంతితో యిలా అన్నాడు. "ఒకనాటి రాత్రి సుధ అదృశ్యమైంది. అనుకోని ఈ అవాంతర సంఘటనకు నాన్న బెంగతో మంచం పట్టాడు. రోజులు భారంగా గడుస్తున్నాయి. ఒకనాడు హఠాత్తుగా పేపర్లో, చెల్లాయి ఫోటోతో సహా రైలు ప్రమాదంలో చనిపోయినట్లు ప్రకటించబడింది. తరువాత కొన్ని మాసాలే బ్రతికాడు నాన్న. తరువాత నేను మద్రాసుకు వెళ్ళి డాక్టర్ వృత్తిలో జీవితం గడుపుతూన్నా అనుకోకుండా ఆరేళ్ళు గడిచాయి. ఇంచుమించు సుధను మర్చేపోయాను తిరిగి ఈనాడు నిన్ను చూసిన నుండి, అవ్యక్తంగా ఉన్న సోదరి ప్రేమ నాలో ప్రవహించింది నిన్ను చూస్తూంటే మా సుధను చూస్తున్నట్టే ఏదో అనుభూతిని పొందుతున్నాను. ఇకనుండి నీవు, నా చెల్లాయివే!" శాంతి ఆ నిశ్చల ప్రేమ వారధిలో ఓలలాడింది. అకస్మాత్తుగా, శాంతి కళ్ళుకూడా. చెమర్చాయి మనసులోని వ్యధను మంచివారితో చెప్పుకుంటే కొంత భారం తగ్గినట్లనిపిస్తుంది శాంతికూడా తనజీవిత చరిత్రను క్లుప్తంగా చెప్పింది.

## 2

హృదయం విప్పి మాటాడకునే వారిని, వారి మంచితనాన్ని గ్రహించకుండా, లేనివి కల్పించి, అపార్థం చేసుకుని అవమానించే ప్రబుద్ధులు అక్కడక్కడా తారసిస్తారు ఎదుటివారి మనస్సు గాయపరచడమే వారి ధ్యేయం ఈర్ష్యాసూయాలు వారి కందుబాటులో ఉంటవి. ఈ కోవకు చెందినదే మేట్రన్ మంగమ్మ తనకున్న అధికారాన్ని తనక్రింది వారిమీద చెలాయిస్తుంటారు—ఇంట్లో అత్తగారు కోడలిమీద సాధించినట్లు అడబడుచులు వదినెలమీద అలిగినట్లు, శానిటోరియంలో కూడా తన గయ్యాళి పాత్రను పోషిస్తుంది మంగమ్మ

వార్డులోని రోగులను ఓసారి పరామర్శించి, గదిలోకి వెళ్తున్న శాంతికి మేట్రన్ నుంచి కాల్ వచ్చింది. తత్తరపడుతూనే శాంతి, మేట్రన్ గదిలోకి అడుగు పెట్టింది. ఎదురుగా, బొద్దుగా, మహంకాళి విగ్రహంలా కూర్చొంది మేట్రన్. ఇంకా నలుగు రైదుగురు సిస్టర్లు కూడా కూర్చొని ఉన్నారు. అంతా తనవైపే ఆత్రంతో చూడడం గమనించింది శాంతి. మేట్రన్ గంభీరంగా ఏదో వ్రాస్తోంది.

"గుడ్ మార్నింగ్ మేడమ్" అంది మేట్రన్ శాంతి కళ్ళలోకి గుచ్చి చూస్తూ, "ఈ మార్నింగ్ లేటేం గానీ, వార్డు నెంబర్ ఫైవ్‌లోకి వెళ్ళావా?"

"లేదు" "అయ్యో! ఎందుకు వెళ్ళలేదూ! ఆ టిబి పేషంట్ నీకోసం కన్నులు కాచేలా చూస్తుంటాడు." ఓ సిస్టర్ వెటకారంగా నవ్వుతూ అంది. శాంతికి కోపం వచ్చింది కానీ, అది సమయం కాదనుకుని నిగ్రహించుకుంది. శాంతి "అతను మీ..." మధ్యలోనే ఆపేసింది ఓ నర్స్ "భర్త కాదు లేవే 'పాప' అని తగిలించుకుంటే బాగుంటుంది" ఎత్తుపళ్ళన్నీ కనిపించేలా నవ్వుతూ అందో సిస్టర్. మిగతా వాళ్ళు యథాశక్తి హాస్యాన్ని ప్రకటించారు. శాంతి కన్నుల్లో నీరు తిరిగింది. ఆమె శరీరం కోపంతో కంపించింది. అయినా తమాయించుకుని, "ఎక్స్క్యూజ్ మీ మేడమ్" అని గిరుక్కున తిరిగి గదిలోకి వెళ్ళిపోయింది.

సాటి వ్యక్తిపై సానుభూతి చూపడం తన నేరమా? మరి, వీళ్ళంతా, దానిని, అతినీచంగా గణించి రంకు కడతారేం? అసలు నర్స్ జీవితమే అంతగదా! ప్రతి రోగిని ఆప్యాయంతో పల్కరించి, వారిని సాధ్యమైనంతవరకు మానసిక బాధలనుంచి విముక్తి చేయాలి. ఆ వ్యథ మానుకుంటేనే రోగం నయమవుతుంది. మరి తను ఆ విధంగా ప్రవర్తిస్తే వీళ్ళంతా ఛీ సంకుచితులు. వార్డు మధ్యలోని గడియారం 12 గం॥ సూచించింది. శాంతి, బెడ్ షెల్ఫ్‌లోని, ఓ బ్రెడ్ తీసుకొని, దానిపై కొంచెం వెన్న కూడా పెట్టుకొని పదమూడో నంబర్ బెడ్ వద్దకు వెళ్ళింది. ఆ పేషంట్ ముసలివాడు వేదాంతి. కళ్ళుమూసుకొని ఏదో కీర్తన పాడుకుంటున్నాడు. శాంతి ముగ్ధురాలై అలాగే నుంచొని వింటోంది అప్రయత్నంగా ఆ మూసిన కళ్ళనుంచి వెచ్చని నీటి బొట్లు చెంపల మీదికి జారాయి.

"తాతా!" శాంతి సౌమ్యంగా పిలిచింది కళ్ళు తెరచిన తాతకు ఎదురుగా శాంతి, రొట్టెతో అన్నపూర్ణలా కనిపించింది. తాత, ఊచల్లాంటి తన చేతులు రెండూ పైకెత్తి నమస్కరించాడు. శాంతి ప్రతి నమస్కారం చేస్తూనే రొట్టెఅందించి, పదహారో నెంబర్ బెడ్ వైపుకి వెళ్ళింది తాత, శాంతి దిక్కు చూస్తూ మరోసారి నమస్కరించి, "కృపామయివి నీకు శుభం కలగాలని భగవంతుని ప్రార్థిస్తున్నాను. మనసులో అనుకున్నాడు

పదహారో నెంబర్ బెడ్ పేషెంటు మధుమూర్తి శాంతిని చూస్తూనే "గుడ్‌నైట్" మేడమ్ డాక్టరేమన్నాడు? డిస్‌ఛార్జ్ ఎప్పుడు చేస్తా

డుట ?" అతని కంఠంలో ఆతురత ధ్వనించింది. శాంతి అతనికేసి చూసి, నిర్లిప్తంగా "ఎల్లుండి" అంది. అతడు తృప్తిగా కళ్ళు మూసుకొని ఏదో ఆలోచించుకుంటున్నాడు. శాంతి భారంగా అడుగులు వేసుకుంటూ తనగదిలోకి వెళ్ళిపోయింది. ఆనాటి రాత్రి శాంతి తన జీవిత చరిత్రను సింహావలోకనం చేసుకుంది.

* * *

....... ఆనాటి సంఘటన తనకింకా జ్ఞాపకముంది. బహుశః శాంతి తన జీవితాంతం కూడా మరవలేదేమో! తన కప్పుడు పదేళ్ళుండొచ్చు. మధు, సుగుణ, తను కలసి ప్రక్క వీధిలో చదుకునేవాళ్ళు. కలిసే బడికి రోజూ వెళ్ళేవాళ్ళు. ఆ నాడు ఆదివారము ........ తన పుట్టినరోజు ఇంట్లో అంతా కోలాహలంగా ఉంది. పెందరాళే లేచి తలంటుపోసుకొని, క్రొత్త బట్టలు వేసుకొని వీధిలోకి వెళ్ళింది. అమ్మవారి గుడి ముందు మధు, సుగుణ, కనిపించారు. ఆ గుడే ఆట స్థలము. తమలో ఎవ్వరు ముందు వచ్చినా, అక్కడే వెయిట్ చెయ్యాలి, కాని, తన యింటికి వాళ్ళెప్పుడూ రారు. తను వాళ్ళింటికి వెళ్ళలేదు. తాము ముగ్గురూ గుడిప్రక్కనే వేపచెట్టుకింద కూర్చున్నారు. మధు, సుగుణ, నా వైపే ఆశ్చర్యంతో కళ్ళప్పగించి చూస్తున్నారు. "అలా చూస్తారేం? యివ్వాళ్ళ నా పుట్టిన రోజు మా యింట్లో పండుగ చేసుకుంటున్నాము. మా యింటికి మీరు విందుకి రావాలి." అని చెపుతూ జేబులోని మైసూర్ పాక్ పొట్లం తీసి వారిచ్చింది వారు తప్పకుండా వస్తామని సంతోషంతో కేరుతూ యిళ్ళకి పరుగెత్తారు. కానీ:.....

వెనుకనుంచే వస్తూన్న మధు తండ్రి మధును కేకేసి పిల్చాడు. తను అక్కడే నుంచొని బిక్కుతూ చూస్తోంది. మధు భయపడుతూనే వచ్చాడు చేతిలోని పొట్లం చూసి "అది అవతల పారెయ్" అని గర్జించాడు. కాని మధు పారేయలేదు. మధు తండ్రి కోపంతో, "వెధవా! చెప్పేది నీక్కాదూ" అని మధు వీపు చిట్లేట్లు కొట్టాడు తరువాత తన వైపు అసహ్యంతో చూస్తూ "అన్నీ పాడు సావాసాలే.. నీవు చెడిపోయింది చాలక మాపిల్లల్ని చెడగొడుతావా? ఛీ మళ్ళీ మా వాడితో కన్పిస్తే డొక్క చీల్చేస్తా" నంటూ గుడ్లురిమాడు.

తరువాత నాన్నతో చెప్పుకొని తను ఏడ్చింది. నాన్న ఈ విషయం వినడంతో అచేతనుడయ్యాడు. తనెంతవరకైతే రహస్యంగా దాచుకుంటూ వచ్చాడో అది కాస్త వెల్లడవబోతూందని తెలుసుకునేసరికి ఆయన

హృదయం నొచ్చు

తన నెలాగో అనునయించాడు అది యిప్పుడర్థమైంది కులమర్యాద నతిక్రమించి, నాన్న ఓ హరిజనుల పిల్లను వివాహమాడడంతో సంఘం బహిష్కరించింది కులం నుండి వెలివేశారు. నాటి సంఘటనతో తనతో ఏ పిల్లలూ ఆడుకునే వాళ్ళు కాదు. బడిలో ఓ మూలగా తనొక్కతే కూరు నేది

విధి వేసిన గాలంలో మానవుడు చిక్కుకొని నిస్సహాయుడై ఒడ్డున పడ్డ చేపలా కొట్టుకొని ప్రాణాలు వదిలుతాడు. ఒకనాడు తను స్కూలునుండి యింటికి వచ్చేసరికి ఇంట్లో చాలా ...డు. ఏమిటా అని ? తను ఆశ్చర్యంతో దారిచేసుకొని లోపలికి వెళ్ళేసరికి నాన్నను నిండుగా కప్పి, పడుకోబెట్టారు.. నాన్న స్నేహితులు ప్రక్కనే విచారంతో కూర్చున్నారు. అప్పుడు తనకర్థమైంది నాన్న చనిపోయినట్టు. నాన్న శవంపై బడి ఏడ్చింది తను.

దహన క్రియలు యథావిధిగా జరిగిపోయాయి. నాన్న స్నేహితుడు తన్ను అనాథ శరణాలయంలో చేర్పించాడు. నాన్న పోయింతగ వాత ఈ ఉత్తరం తన కిమ్మన్నాడని ఓ ఉత్తరం రామనాథం తన చేతికిచ్చాడు. చేతులు

చేశాము. ఆ వివరాలను ...
రామనాధం వలన తెలుసుకో ;
నీ జీవితాన్ని నడి సముద్రంలో
ముంచివేసి ఈ లోకంనుండి
శాశ్వతంగా మీ అమ్మ దగ్గరకు వెళు
తున్నా ...

నీ.

నాన్న"


ఈ విధంగా తన జీవితమార్గంలో
యింకో మలుపు తిరిగింది. అనాధ
శరణాలయంలో నాకు శాంతి లభించ
లేదు అయినా, ఇంటర్ వరకు అక్కడే
ఉండి చదువుకున్న. మధు, తనూ ఒకే
కాలేజీలో చదువుకునే వాళ్ళు

యంలో పూర్తిగా
యీపు దిద్దుకుంది. రామనాధం
నర్స్ ట్రెయినింగ్‌లో చేరాడానికి
వలయు సన్నాహాలు పూర్తిచేశాడు.
తరువాత తను ట్రయినింగులో
చేరింది తనకు చెందాల్సిన ఆస్తిని
రామనాథం కాజేశాడు.

తను ఏకాకి ..అనాధ. ఏమీ
చేయలేని అసమర్థురాలు ... గణగణ
అలారం మ్రోగడంతో శాంతి ఆలోచ
నలకు అంతరాయం కలిగింది

3

సంధ్యా సమయం ఆకాశం అరుణ
రాగరంజితమైంది. కొండ అవతలికి




"లిల్లీ జాగ్రత్తగా కూచో. నేను కొంచెం స్పీడు పెంచబోతున్నా."

వెళ్ళిపోతూన్న సూర్యుడు, అరవిచ్చిన గులాబిపొట్టవలె కన్పిస్తున్నాడు. హాస్పిటల్ మేడమీద నుంచొని చూస్తూన్న శాంతికి ఆ దృశ్యం ఏదో తెలియని ఆనందాన్ని ప్రసాదిస్తోంది

ఒక్కొక్క వ్యక్తిని చూసినప్పుడు అతన్ని ఇదివరకెప్పుడో చూసినట్టు అనుభూతి కల్గుతుంది నిజానికి అతన్ని ఎక్కడా, చూడకపోయినా, ఎదుటివారికి మాత్రం తాత్కాలి కానందాన్ని చేకూరుస్తారు. దీనినే పూర్వజన్మ బంధం అంటారు మన వాళ్ళు. ఈ బంధం ఎంత చిత్రంగా రూపు దిద్దుకుంటుందో చెప్పలేము.

మొట్ట మొదట డాక్టర్ మురళీ కృష్ణ, శాంతిని చూసినప్పుడు తన చెల్లాయిని చూస్తున్నట్టె అనుభూతిని పొందాడు. తన మనశ్శాంతి కొరకు శాంతిని యింట్లో ఉండమని కోరాడు.

ప్రేమించే వ్యక్తి సుగుణాలు, మంచితనం విశేషంగా ఎదుటి వారిని ఆకర్షిస్తుంది. ఈ ఆకర్షణ ఫలితమే ఆత్మీయతకు దారితీయటం.

తన వలన మురళికి మనశ్శాంతి లభిస్తుంది. తనకు మధు కావాలి. అయితేనేం తనకు శాంతి. ఇంటర్ వరకు కలిసి చదువుకొన్న మధు, శాంతితో రియంలోని మధు కాదు ఆ మధుకు ఈ మదుకు మధ్య అగాధం. తనను మధు గుర్తించలేదు కనీసం ఎక్కడో చూచినట్టు కూడా అనుకోడు. ఎలా అనుకుంటాడు? తను విధివంచిత! కాల

చిత్ర భ్రమణంలో నాలుగేళ్ళు నలిగి, నలిగి, కుమిలిపోయి శేష జీవితాన్ని గడుపుతుంది తను. అతనో? మాంచి ఉద్యోగం. అందమైన భార్య ..... ఇక ఆలోచించలేకపోయింది శాంతి. ఇదంతా రామనాధం చేసిన మోసం, వేసిన ఎత్తుగడ, అల్లిన వలలో చిక్కుకుంది. తను కట్టుకున్న యింట్లో తనే బందీ అయినట్టు!.. ఛీ! మిత్రద్రోహి! ఆస్తినంతా, తనపేర వ్రాయించుకోవడమే కాక, తన జీవితాన్నే బలిచేసిన కసాయి. స్వార్థుడు.......మధుకు తన బిడ్డనిచ్చి పెళ్ళిచేద్దామనే అభిప్రాయంతో కుత్సిత బుద్ధితో మధునుండి తన్ను వేరు చేశాడు వానికి తగ్గట్టు దైవం కూడా అనుకూలించలేదు......మధు ఆ పెళ్ళిని తిరస్కరించాడు

క్రింద కారు చప్పుడైంది శాంతి మేడదిగి క్రిందకి వచ్చింది. బయట మునిసిపాలిటీ దీపాలు భారంగా వెలుతున్నాయి. ఆ మసక వెలుతురులో మనుష్యుల నీడలు వికృతంగా కన్పిస్తున్నాయి.


...మధు వెళ్ళి కారులో కూర్చున్నాడు. అతని వెనకే ఓ యువతి డ్రైవింగ్ సీటులో కూర్చొంది. ఆవిడ అతని భార్య కావొచ్చు అనుకుంది శాంతి. కారు వెళ్ళిన దిక్కే చూస్తూ నుంచొంది.

ఆ సమయంలో స్త్రీ సహజమైన రాగ ద్వేషాలు శాంతిని ఆవరించి కలత పెట్టాయి అలా ఎంత సేపు నుంచుందో? ఏమో!! డాక్టరు మురళి పల్కరించడంతో ఈ లోకానికి వచ్చింది శాంతి

ఒంట్లో బాగా లేదని హాస్పటల్ కు వారం రోజులు సెలవు పెట్టింది.

ఈ వారం రోజులు మధును గురించే ఆలోచనలు. అతడు వ్రాసిన లేఖలను చదువుతూ కాలం గడిపింది వయస్సు మళ్లిన ఊసరవెలిలా కాలం రంగులు మార్చుకుంటుంది మానసికంగా వృద్ధురాలైంది శాంతి చిన్నప్పుడే మాతృహీన అయిన శాంతి హృదయానికి పట్టుమని పదేళ్లు నిండకుండానే అశని ఘాతంలా వర్ణసాంకర్యం గుచ్చుకొంది. ఆ మానని గాయం అప్పుడప్పుడు మనసును కెలుకుతున్నా. ధైర్యంగా జీవితంలో ఎదురు నిలవాలని ప్రయత్నించింది. కాని, విధి వక్రించింది, పరిస్థితులు పరిహసించాయి.

"పరిస్థితులకు తల ఒగ్గకూడదనీ పురోగమనమే జీవిత లక్ష్యమనీ", ప్రోత్సహించిన, మధు యం. బి. చదవడానికి వెళ్లిపోతూ రాసిన ఆఖరి ఉత్తరం శాంతి యింకా మర్చిపోలేదు. ఆ




ఉత్తరమే శాంతి జీవితానికి ఊరట కల్గించేది

* * *

చల్లని సముద్రపుగాలికి నుదుటిమీద పడుతున్న ముంగురులను పైకి తోస్తూ చితికిపోతున్న తరంగాలను తదేకంగా చూస్తూ కూర్చొంది సుధారాణి

“సుధా!” యిసుకతో పిచ్చిక గూళ్లు కడుతున్న మధు లాలనగా పలకరించేడు. ఏమిటన్నట్టు మధు వైపు తల త్రిప్పి చూచింది సుధ

“ఒక టడుగుతా, చెప్తావా?” అన్నాడు మధు.

“బలే వారే! సంభాషణ సస్పెన్స్‌లో సాగుతుందే! మీరు అడగడము— నేను కాదనడమూనా! అడగండి,” అంది సుధారాణి.

“ఒకదిక్కు ఒక స్త్రీని మూర్ఖాచారాలనుండి ఉద్ధరించి పెళ్ళి చేసుకోవాలని, ఓ యువకుని సంస్కార యుక్తమైన ఆశయం. ఆదర్శమూను: ఇంకోదిక్కు జాతిభ్రష్టయై ఉన్నత కుటుంబాల ఉక్కు పాదాలక్రింద నలిగి నశించే అమాయక స్త్రీని, తన ప్రేమమూర్తిని హృదయంలో నిల్పుకొని, సదా ఆరాధించే ప్రేయసిని పెళ్ళి చేసుకోవాలని; లేక, ఈ రెండు ఆదర్శాల మధ్య నలిగిపోయి చివరికి తన జీవితాన్నే ఆ యువకుడు త్యాగం చేసుకోవాలా? ...” మధు ఆవేశంగా ప్రశ్నించాడు

“అయితే నా కథకు ప్లాటు దొరికినట్టే?” సుధారాణి నవ్వుతూ అంది.

సుధ కొద్దిసేపు ఆలోచించి ఈలా అంది.

"ఈ రెంటిలో ఏ స్త్రీ నైనా సరే పెళ్ళి చేసుకోకుండా త్యాగం చేస్తున్నానుకదా అని జీవితంనుండి నిష్క్రమించడం. పరిస్థితులకు భయపడి పారిపోయినవాణ్ణిగా లోకం జమకడుతుంది. అసమర్థుడుగా కళంకాన్ని ఆపాదించుకుంటాడు. అలా చేయడం శుద్ధ తెలివితక్కువ.

"ఇక మొదటిది. ఒక స్త్రీని సంస్కారహృదయంతో ఉద్ధరించాలనీ, ఆ స్త్రీ కూడా, జీవితాంతం పసుపు కుంకుమలతో తోటి ముత్తైదువుల్లా సుఖ సంతోషాలతో కళకళలాడాలనీ, ఆదర్శ జీవితం గడపాలనీ, సాహసించి ముందడుగు వేస్తే మంచిదే కానీ........ దీనికి చిత్తసంస్కారం పూర్ణంగా ఉండాలి.

"రెండవది: జాత్యైక్యతకు సంబంధించినది. మానవులంతా ఒక కులంగా పరిణమించాలనే సిద్ధాంతానికి అనువర్తిస్తుంది. ఈ రెండూ, సాంఘిక కట్టుబాట్లలోనివే అయినా, మనోబలం వల్ల స్వయం నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. ఈ రెండింటికీ అవినాభావ సంబంధమే. నిస్వార్థ త్యాగమే మూలాధారము. ఇదంతా వ్యక్తుల అనుభవాన్ని అనుసరించి ఉంటుంది."

"సుధా! ఎంత చక్కగా విశదీకరించావ్. ఎంతైనా, కవయిత్రివిగదా!"

మధు కనులు ఆనందంతో విస్ఫారితమయ్యాయి.

## 4

ఎదురుగా భయంకర మృత్యువులా పరుగెత్తుకొస్తున్నదో కారు అన్యమనస్కంగా, వడివడిగా నడుస్తున్న శాంతి హెడ్ లైట్స్ కాంతికి కళ్ళు మూసుకుంటూ అలాగే స్తంభించిపోయింది వెంటనే "అమ్మో!" అని కేక... కారు బ్రేకులు కీచుమన్నాయి.

మధు వేగంగా కారు దిగేడు. ఫ్రంట్ మడ్ గార్డ్ శాంతి నొసటను చిట్లించింది. 'శాంతీ' ఆత్రంగా అరిచాడు మధు. బరువుగా కనులు తెరిచింది శాంతి. ఎదురుగా మధును చూస్తూనే నీరసంతో మూల్గుతూ కళ్ళు మూసింది. మధు, శాంతి పర్సులోని అడ్రస్ చూసి, డాక్టర్ మురళీకృష్ణకు ఫోన్ చేశాడు. మురళి చూసి వెళ్ళేడు. కొద్దిరోజుల్లోనే శాంతికి గాయం మాని కొంచెం నెమ్మది చేకూరింది.

ఒకనాడు శాంతి మధు లైబ్రరీలో ఏదో పుస్తకం వెతుకుతుంటే సుధారాణి డైరీ కనబడింది. వద్దనుకుంటూనే డైరీ విప్పి చదువసాగింది

1 పేజి......

"చిన్నప్పుడే పసుపుకుంకుమలకు కరవైన నాకు తిరిగి ఆ మహాభాగ్యాన్ని

ప్రసాదించిన మధుకు నే నెప్పుడూ కృతజ్ఞురాలినే!

ఇట్లు—
సుధారాణి"

2 వ పేజి......

"రైలుప్రమాదానంతరం మేమిద్దరం ఒకే వార్డులో కలుసుకోవడం విధి విలాసం అప్పుడే వారు నాకు పరిచయ మయ్యారు.

నా దీనస్థితిని విని, జాలిపడి తను ప్రేమించిన స్త్రీనిగూడా పరిత్యజించి, నన్ను చేపట్టారు. వారు పెట్టిన భిక్షే, నేటి నా స్థితి."

4 వ పేజి......

"రైలు ప్రమాదంలో నేను మరణించినట్టు ప్రకటించారు. ఇదీ నా మేలుకోరకే జరిగినట్టు తలంచుతాను.

......పోలీసు వాళ్ళు గాయపడిన వాళ్ళను ఆసుపత్రికి పంపుతూ, జేబులు వెతుకుతూ ఎడ్రస్‌లు వాకబు చేస్తున్నారు. నా పర్సు నా ప్రక్కనే పడివున్న శవందగ్గర పడిపోయింది అందులో ఫోటో ఉండడమువల్ల — ఆ అడ్రస్ ఆ శవందే అనుకుని ఫోటోతో సహా చచ్చినవారి జాబితాలో ప్రకటించారు."

8 వ పేజి......

"పిన్ని పోరుకు తాళలేక ఇంట్లో ఎవరితో చెప్పకుండా వచ్చాను మురళన్నయ్యతో కూడా చెప్పలేకపోయాను. అలాంటి సహృదయునికి నేను చెల్లెలయే భాగ్యాన్ని అనుభవించలేకపోయాను. బహుశా ఈపాటికి నన్ను మర్చేఉంటాడు."

* * *

శాంతి యిక చదవలేక పోయింది. డాక్టర్ మురళీకృష్ణ చెల్లెలే ఈ సుధారాణి... ఛీ...సుధారాణికి ఎంత ద్రోహం తలపెట్టాను. పచ్చని వారి దాంపత్యంలోకి చిచ్చులా ప్రవేశించ దలుచుకున్నాను. మధుని నేను ప్రేమించినమాట వాస్తవమే. అతన్ని ఎప్పటికీ ప్రేమిస్తా. కానీ.........!.

'మురళీ! నీ చెల్లాయికి ద్రోహం చెయ్యలేను. సుధారాణి నాకు సోదరి లాంటిది. మధువంటి సంస్కారహృదయుడ్ని కట్టుకుని కలకాలం సుఖంగా వర్థిల్లాలని భగవంతుని ప్రార్థిస్తాను. నీ సుధారాణికి అడ్డు తగలను. నా మధూకు దూరం కాలేను.' శాంతి తన నిశ్చయాన్ని ఓ ఉత్తరంలో వ్రాసి బెడ్ మీద ఉంచి ఎటో వెళ్ళిపోయింది.

......"శాంతీ!" వణుకుతున్న చేతులతో మురళి ఉత్తరం విప్పేడు. గాలికి రెపరెపలాడుతున్న ఆ ఉత్తరాన్ని మురళి తన గుండెల్లోకి హత్తుకున్నాడు.

అన్నయ్యా!

తప్పు చేసిందొకరైతే, అనుభవించేదొకరు. అమ్మా, నాన్నల వర్ణాతిక్రమణ ఫలితమే నేను. కరడు గట్టిన హృదయంతో ఈ లోకంలోని కాకులను ఎదిరించి, నిల్చిఉన్నంత కాలం, వారి జీవితం సుఖంగానే గడిచింది. వాళ్ళ వియోగంతో అసహాయనైన నామీద లోకం కసి తీర్చుకోవాలని విజృంభించింది

అనాథను - ఏకాకిని. ఏవగించుకొన్నది ధనిక లోకం.

జీవితం చివరిఘట్టంలో 'చెల్లీ' అని ఆప్యాయంగా పిలిచి ఆత్మీయతామృతాన్ని చిలికించి మోడు వారిన నా హృదయాన్ని చిగిర్చిన నీ ఋణం తీర్చుకోలేను అన్నయ్యా!!

మనిషిలోని మానవతను ఎత్తి చూపి, మనిషిగా బ్రతకడం నేర్పిన మన యీ విచిత్ర అనుబంధం ఎన్ని జన్మాలదో!! ఊహాతీతం.''

నేను సార్థక నామధేయను గాదు. తిరిగి పునర్జన్మ అనేదే ఉంటే నీకు చెల్లాయిగా పుట్టాలని భగవంతుని ప్రార్థిస్తున్నాను. నీ సుధారాణి చనిపోలేదు. ఆమెకు నేను ద్రోహం చేయలేను. మధుతో మన చెల్లికాపురం చిరకాలం సాగాలని ఆశీర్వదిస్తూ నిష్క్రమిస్తున్న.



నీ చెల్లి
శాంతి''

మురళి కళ్ళనుంచి ఒక కన్నీటి కణం రాలింది. ఆకాశంలోని నక్షత్రం నేల కురికింది